

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 27.0 । కనిష్ఠం : 23.0





విద్యార్థుల మధ్య ఘర్షణ

- నలుగురు పిల్లలకు గాయాలు 7
- దేవరకద్ర మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఘటన

ధాన్యం.. దోపిడీ

- పక్క రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న రైస్ మిల్లర్లు
- నెలరోజుల వ్యవధిలో మూడు లారీలను పట్టుకున్న అధికారులు
- నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్న పౌరసరఫరాల శాఖ
- సీఎంఆర్ స్థానంలో రేషన్ రీసైక్లింగ్ బియ్యం సీఎస్‌సీకి అప్పగింత
- చక్రం తిప్పుతున్న రైస్ మిల్లర్ల సంఘం.. రోజూ ఆఫీసుల వద్ద నాయకుల పైరవీలు

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం శాఖాపూర్ వద్ద ఈ నెల 11న పట్టుబడిన ధాన్యం లారీ



మహబూబ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పౌరసరఫరాల శాఖలో ఎన్ని ప్రక్షాళనలు చేస్తున్నా.. ధాన్యం పక్కదారి పట్టించడం మాత్రం ఆగడం లేదు. అధికారుల అండదండలు దండిగా ఉండటం, ఏదైనా తప్పు జరిగి దొరికినప్పుడు రైస్ మిల్లర్ల సంఘం పూర్తి స్థాయిలో కార్యాలయాల వద్దనే ఉండి పైరవీలు చేయడం, ఆమ్యామ్యాలు అందిస్తుండటంతో సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం యథేచ్ఛగా పక్క రాష్ట్రాలకు తరలిపోతోంది. నెల రోజుల వ్యవధిలోనే మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల పరిధిలో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న మూడు లారీల ధాన్యాన్ని పట్టుకున్నారు. ఇందులో ఇప్పటికే రెండు లారీలకు దాదాపు క్లీన్‌చిట్ ఇచ్చి విడుదల చేయగా.. ఈ నెల 11వ తేదీన పెబ్బేరు మండలం శాఖాపూర్ వద్ద పట్టుకున్న లారీకి సంబంధించి విచారణ కొనసాగుతోంది. రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయడం కోసం ప్రభుత్వం ఏటా రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం రైస్ మిల్లులకు కేటాయిస్తోంది. ఆ ధాన్యాన్ని మరఆడించి.. తిరిగి ఎఫ్‌సీఐకి, సీఎస్‌సీకి మిల్లర్లు నిర్దేశిత గడువులోగా అప్పగించాలి. కానీ ఏ జిల్లాలోనూ మిల్లర్లు సీఎంఆర్‌ను సమయానికి డెలివరీ చేయడం లేదు. గడువుపై గడువు పెంచుకుంటూ పోయినా వేలాది మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లోనే ఉంచుతున్నారు. సీఎంఆర్ ఇవ్వని మిల్లులపై ఆర్ఆర్ యాక్టు (రెవెన్యూ రికవరీ) పెడతామని గతంలో చెప్పినప్పటికీ వారు మాత్రం బెదరడం లేదు. ప్రభుత్వ స్థాయిలో ఈ విషయంపై సీరియస్‌గా ఉన్నప్పటికీ.. స్థానికంగా ఉండే అధికారుల ఉదాసీన వైఖరితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎప్పుడైనా కచ్చితమైన సమాచారంతో ధాన్యం లేదా రేషన్ బియ్యం పట్టుబడినా.. టెక్నికల్ అసిస్టెంట్లను మేనేజ్ చేయడం దగ్గర నుంచి విడుదల చేయడం వరకు అధికారులే

(మిగతా 6లో..)



నర్వ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం గుమిగూడిన రైతులు

యూరియా కోసం పోరు

నెల రోజులుగా అదే తీరు

- నారాయణపేటలో రైతుల రాస్తారోకో
- పలుచోట్ల పీఏసీఎస్‌ల వద్ద బారులు
- పోలీసు పహారాలో యూరియా పంపిణీ
- బిజినేపల్లిలో తోపులాట 6
- తెగిపోయిన మహిళ పుస్తెల తాడు

నేడు తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న మంత్రి జూపల్లి
- కలెక్టరేట్‌లో పూర్తయిన ఏర్పాట్లు
- గంటపాటు నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17ను కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజా దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా బుధవారం కలెక్టరేట్ సమీకృత భవనంలో ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై ఉదయం 10 గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి సందేశం ఇస్తారు. 10:30 గంటల నుంచి 11:20 గంటల వరకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.



మద్యం తాగి వాహనాలు నడుపొద్దని సుభాష్ చౌరస్తాలో ప్లకార్డు పట్టుకొని అవగాహన కల్పిస్తున్న వ్యక్తి

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు వినూత్న తీర్పు

- కూడళ్లలో ప్లకార్డులతో అవగాహన కల్పించాలని ఆదేశం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుపడ్డ వ్యక్తికి మహబూబ్‌నగర్ జిల్లా న్యాయాధికారి మంగళవారం వినూత్న తీర్పును ఇచ్చారు. డ్రంకెన్ డ్రైవ్ చేయొద్దని ప్లకార్డులు పట్టుకుని వాహనదారులకు కూడళ్లలో అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ తీర్పు అమలు బాధ్యతను ట్రాఫిక్ పోలీసులకు అప్పగించారు. గత ఆగస్టు 24న నగరంలోని బోయపల్లి రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తుండగా, మోతీనగర్‌కు చెందిన రాఘవేందర్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుపడ్డాడు. మంగళవారం అతన్ని రెండో తరగతి కోర్టులో న్యాయాధికారి నిర్మల ముందు హాజరుపరిచారు. న్యాయాధికారి నిందితుడికి రూ.2 వేల జరిమానాతో పాటు ప్రధాన కూడళ్లలో ప్లకార్డులు పట్టుకొని వాహనదారులకు మద్యం తాగి వాహనాలు నడుపొద్దని రెండు రోజుల పాటు అవగాహన కల్పించాలని తీర్పు ఇచ్చారు. ట్రాఫిక్ పోలీసులు వెంటనే తీర్పును అమలు పరుస్తూ మంగళవారం మొదటి రోజు రాఘవేందర్‌తో పలు కూడళ్లలో ప్లకార్డులు పట్టించి, వాహనదారులకు అవగాహన కల్పించారు.

మీ పిల్లల చదువు బాధ్యత మేం తీసుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మీ పిల్లలను చదివించే బాధ్యత తాము తీసుకుంటామని, ఇంటికొచ్చిన పిల్లలతో తల్లిదండ్రులుగా పాఠశాలలో ఏం నేర్చుకున్నారన్న విషయాలను అడగాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లేదంటే వారు పక్కదారి పట్టే ప్రమాదం ఉందన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్‌నగర్ ఫస్ట్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శత శాతం కార్యక్రమానికి ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాము చదివే రోజుల్లో టీవీ, సెల్‌ఫోన్, గంజాయి, సిగరెట్ వంటివి లేవని, ఇప్పుడు అవన్నీ మన ఊరు మధ్యకొచ్చాయని అన్నారు. వాటికి బానిసలు కాకుండా చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇంటర్ వరకు విద్యార్థులను మంచి మార్గంలోకి తీసుకెళ్తే భవిష్యత్తు చదువులు వాళ్లే చూసుకుంటారన్నారు. ఈ ఇరవై నెలల కాలంలో బెస్ట్ కాలేజీలను హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు తెచ్చామని, మరో పాలిటెక్నిక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, బీటెక్ చదువులు తెస్తామన్నారు. హైదరాబాద్‌లో చదివే పిల్లలకు మన పిల్లలు తీసిపోరన్నారు. వారికి సరైన అవకాశం, ప్రోత్సాహం, మార్గం చూపిస్తే హైదరాబాద్ పిల్లలకన్నా అద్భుతంగా చదువుతారన్నారు. సమావేశంలో వందేమాతరం ఫౌండర్ రవీందర్, నాయకులు వినోద్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, సీఎంఓ బాలు యాదవ్ ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

నేరస్తులకు శిక్ష పడాలి

- సమీక్షలో ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన వారికి తప్పకుండా శిక్ష పడాలని, పోలీసులు, ఆ విధంగా దర్యాప్తును కొనసాగించాలని ఎస్పీ జానకి అన్నారు. శిక్షల శాతం పెరిగేలా పోలీసులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అన్ని పోలీస్ స్టేషన్‌ల వారీగా కేసుల వివరాలు, పెండింగ్ కేసుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ కేసును పారదర్శకంగా, లోతుగా విచారించాలని సూచించారు. అప్పుడే నిందితులకు కోర్టులలో శిక్ష పడుతుందన్నారు. గ్రేవ్, నాన్‌గ్రేవ్, యూఐ, ఎస్సీ, ఎస్టీ కేసులు, పోక్సో కేసులపై సమీక్షించారు. పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- టెలీ కాన్ఫరెన్స్‌లో డీపీఓ పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ పార్థసారథి

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలాల పరిధిలో ఎంపీవోలు, గ్రామ పంచాయతీల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీపీఓ పార్థసారథి హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని 16 మండలాల ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. బుధవారం అన్ని గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయలన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ పథకంలో భాగంగా అన్ని గ్రామాలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చేపట్టిన పనుల ఫొటోలను, డీఎస్ఆర్ యాప్‌లో హాజరును అప్‌లోడ్ చేయలన్నారు. చేయని కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో పౌరల సేవలు ప్రజలకు వేగవంతంగా అందించాలన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో పెండింగ్ ఫైల్స్‌పై సమీక్ష నిర్వహించారు. గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో కార్యాలయ ఏవో గిరిధర్, డీపీఎం అహ్మద్, సీనియర్ అసిస్టెంట్లు ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస చారి, జూనియర్ అసిస్టెంట్లు సరిత, మౌలానా పాల్గొన్నారు.

జ్వరంతో వెళ్తే.. కుక్కకాటు ఇంజక్షన్

- వైద్యుడు రాసిన చిట్టీని సరిగా చూడకుండా వేసిన నర్సు 7
- దేవరకద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో ఘటన

ఆరోగ్య మహిళా.. ఆయుష్మాన్‌భవ



మహిళకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

- స్వస్థనారీ, స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం
- నేటి నుంచి అక్టోబరు 2 వరకు వైద్య శిబిరాలు
- నేడు బాలానగర్‌లో ప్రారంభం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశంలోని మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం స్వస్థనారి స్వశక్తి పరివార్ అభియాన్(మహిళ ఆరోగ్యమే కుటుంబ బలం.. ఆరోగ్యవంతమైన పిల్లలు, కుటుంబం, సమాజం శక్తివంతం కావడం) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బుధవారం నుంచి దేశవ్యాప్తంగా దీనిని ప్రారంభించనున్నారు. ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్నారు. జిల్లాలోని బాలానగర్ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బుధవారం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేసింది. ఎంపీ డీకే అరుణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

నేటి నుంచి..

స్వస్థనారీ, స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతీ పీహెచ్‌సీలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వివిధ రకాల స్పెషాలిటీ వైద్య సేవలు అందించనున్నారు. జిల్లాలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లు, 3 సీహెచ్‌సీలు, 3 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. ప్రతీ పీహెచ్‌సీలో 5 క్యాంపుల చొప్పున రోజూ ఓ స్పెషాలిటీ వైద్యానికి సంబంధించిన డాక్టర్ శిబిరాల్లో పాల్గొంటారు.

వైద్య శిబిరాలలో నిర్వహించే పరీక్షలు..

వైద్య శిబిరాల్లో భాగంగా మహిళలకు అధిక రక్తపోటు, మధుమేహం, రక్తహీనత, టీబీ, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేయనున్నారు. చిన్న పిల్లల్లో సికిల్ సెల్, తలసేమియా, పోషకాహార లోపాన్ని గుర్తించే పరీక్షలు చేస్తారు. మహిళల్లో రుతు, పరిశుభ్రత, పిల్లల్లో కౌమార దశ, పోషణ, వంట నూనెల వినియోగం, వ్యాపించే రోగాలు, ఆరోగ్యం, పోషకాహారంపై అవగాహన నిర్వహించనున్నారు. టీబీ వ్యాధిగ్రస్తులకు పోషకాహారాన్ని అందించే దాతలను గుర్తించి 'నిక్షయ్ మిత్ర'లో నమోదు చేయనున్నారు. అక్టోబరు 1న రక్తదాన శిబిరాలు నిర్వహిస్తారు. అక్టోబరు 11 వరకు అంగన్‌వాడీ కేంద్రాలలో పోషన్ మహ్ పేరుతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు.



గ్రామస్థులతో కలిసి రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షం నాయకులు

నీటి ఎద్దడి తీర్చాలి

- కృష్ణలో అఖిలపక్షం రాస్తారోకో

కృష్ణ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణ మండల కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కృష్ణ మండలం ఏర్పడి 9 సంవత్సరాలు అయినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తాగునీటి ఎద్దడితో పాటు డ్రైనేజీలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కృష్ణలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. శేషాద్రి పవర్ ప్లాంట్ కోసం సేకరించిన భూముల్లో చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేయాలని, లేదంటే భూములను తిరిగి ఇప్పించాలన్నారు. అనంతరం మహిళలు ఖాళీ బిందెలతో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్, బీజేపీ మండల అధ్యక్షుడు నర్సప్ప, దండు రాఘవేంద్ర, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివప్ప, అశోక్ గౌడ్, మహాలింగ పాల్గొన్నారు.





లాన్ టెన్నిస్‌లో ఏఎస్పీ ప్రతిభ
అభినందించిన ఎస్పీ


అదనపు ఎస్పీని అభినందిస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట టౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన 22వ ఓపెన్ లాన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ నేషనల్ లెవల్‌లో 55 ఏళ్ల కేటగిరీలో అదనపు ఎస్పీ ఎండీ.రియాజ్ హుల్‌హక్, మల్టీ జోన్-1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డిలు డబుల్స్ విభాగంలో పోటీపడి ఫైనల్‌లో జూబ్లీహిల్స్ టీమ్‌పై గెలుపొందారు. నారాయణపేట జిల్లా నుంచి పాల్గొన్న అదనపు ఎస్పీని ఎస్పీ యోగేష్‌గౌతమ్ మంగళవారం అభినందించారు. విధుల పట్ల కర్తవ్యం, నిబద్ధతతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరచడం పోలీస్‌శాఖకు గర్వకారణమన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

కలెక్టర్‌ను కలిసిన పీయూ వైస్ చాన్స్‌లర్

» నాల్గవ స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆహ్వానం


కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబు

పాలమూరు యూనివర్సిటీ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో వచ్చే నెల 16న జరిగే నాల్గవ స్నాతకోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని మంగళవారం కలెక్టర్ విజయేందిర బోయికి పీయూ వైస్‌చాన్స్‌లర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబుతో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో జరిగే అభివృద్ధి పనులు, కొత్త కోర్సులు, బడ్జెట్, వసతులపై చర్చించారు.

మద్దూర్‌లో కోతుల పట్టివేత

» జూపార్కుకు తరలింపు

» బాధిత వ్యక్తులకు కమిషనర్ పరామర్శ

మద్దూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూర్‌లో మనుషులపై దాడి చేస్తున్న కోతులను నెల్లూరు నుంచి వచ్చిన ప్రత్యేక బృందం పట్టుకుంది. ఫారెస్టు రేంజ్ అధికారి లక్ష్మణ్ సమక్షంలో బృందం సభ్యులు ఏర్పాటుచేసిన బోనుకు అవి చిక్కాయి. బోనుకు చిక్కిన ఏడు కోతులను హైదరాబాద్‌లోని జూపార్కుకు తరలించి అక్కడి సిబ్బందికి అప్పగించినట్లు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఇదిలా ఉండగా మంగళవారం కూడా మరో ఐదు కోతులు బోనుకు చిక్కినట్లు కమిషనర్ చెప్పారు. కాగా, కోతుల దాడిలో గాయపడిన బాధితులను కమిషనర్ పరామర్శించి, దాడి వివరాలను తెలుసుకున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పట్టణంలో సంచరిస్తున్న కోతులన్నింటిని పట్టుకోడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అది మహత్తర పోరాటం

» తెలంగాణ సాయుధ పోరాటంపై ఆవాస్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్

కల్వకుర్తి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం హిందూ, ముస్లింల పోరాటం కాదని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహత్తర పోరాటమని ఆవాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అబ్బాస్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ భవనంలో యూటీఎఫ్, సీఐటీయూ, కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటం వాస్తవాలు, వక్రీకరణలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. యూటీఎఫ్ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఏపీ మల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అబ్బాస్ హాజరై ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాటం విమోచనమా, విలీనమా అనే చర్చ నడుస్తోందన్నారు. కొంతమంది సెప్టెంబరు 17 విద్రోహ దినం అనుకుంటున్నప్పటికీ ప్రజలు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నిరంకుశ నిజాం ప్రభుత్వంలో దొరలు, జాగీర్దార్లు ప్రజలపై తీవ్రమైన పన్నులు వేస్తూ దొరల గడీల్లో పేదలను వెట్టిచాకిరీ చేయించుకున్నారన్నారు. భూస్వామ్య దోపిడీ, జమీందార్ అణచివేత గురించి ప్రజలు విముక్తి పొందడానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించి నడిపించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, బాలరాజు, ఆంజనేయులు, లక్ష్మణచారి, శ్రీనివాసులు, రాజాబాబు, పరుశరాములు, నాగయ్య, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఇంకుడు గుంతలతో నీటి సంరక్షణ సాధ్యం

బిజినేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలు అడుగంటకుండా ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటే నీటి సంరక్షణ సాధ్యమవుతుందని పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ నవత అన్నారు. మండలంలోని మంగనూర్‌లో పాలెం వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నీటి సంరక్షణపై గ్రామస్థులకు ఆమె అవగాహన కల్పించారు. భవిష్యతు తరాల నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ ఒక్కరు బాధ్యతగా నీటి సంరక్షణ చేపట్టాలని కోరారు. శాస్త్రవేత్త రమ్య, ఏఈవో క్రాంతి కుమార్, వ్యవసాయ విద్యార్థులు ఉన్నారు.

దేవాలయ భూమి
ఆక్రమణకు యత్నం

» అడ్డుకున్న కాలనీవాసులు


» కేసు నమోదు చేసిన పోలీసులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దేవాలయానికి చెందిన భూమి తమదేనంటూ ఎక్స్‌కవేటర్‌తో పనులు చేపట్టిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ రెండవ ఎస్ఐ సతీశ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ జిల్లా కేంద్రంలోని గంటవీధి సమీపంలో ఉన్న గోపాలస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న తమదేన ని చెప్తూ సతీశ్, చిన్న నర్సింహ, పెద్ద నర్సింహులు మంగళవారం ఎక్స్ కవేటర్‌తో చదును చేయడం మొదలు పెట్టారు. అందుకు కాలనీ వాసులు అభ్యంతరం చెప్పడంతో పాత డాక్యుమెట్లు చూపించారు. ఈ భూమి 40 ఏళ్లుగా దేవాలయానికి చెందినదేనని, నకిలీ ధ్రువపత్రాలతో ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని కాలనీ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ తెలిపారు.

చరిత్ర మరువని రోజు

తెలంగాణ చరిత్ర మరువని రోజు సెప్టెంబరు 17 1948. అది నిజాం నిరంకుశత్వం తలవంచిన రోజు. రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు. నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినం. ఈ నేలపై త్రివర్ణపతాకం ఎగిరిన రోజు. అంతటి ఘన చరిత్ర కలిగిన ఈ రోజుపై ఇప్పుడు వివాదాలు నడుస్తున్నాయి. ఆ వివాదాల సంగతి పక్కన పెడితే నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారతప్రభుత్వంలో కలిసిన ఆ రోజు వెనుక అనేక ఘటనలు ఉన్నాయి. అందులో కొన్ని అంశాలు, ప్రముఖుల అభిప్రాయాలతో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు16(ఆంధ్రజ్యోతి)




సర్దార్ వల్లభాయి పటేల్ నిజాం ప్రభువు

ఈ ఘట్టానికి ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ

తెలంగాణ చరిత్రలోనే మరచిపోలేని సెప్టెంబరు 17. ఈ ఘట్టంలో ప్రతినాయకుడు ఖాసీం రజ్వీ. 'మజ్లిస్ ఎ ఇత్తేహాద్ ఉల్ ముస్లిమీన్' నాయకుడు. ఆయన స్వస్థలం మరఠ్వాడాలోని ఉస్మానాబాద్ జిల్లా లాతూర్. అలీగఢ్‌లో న్యాయశాస్త్రం అభ్యసించిన అనంతరం హైదరాబాద్‌లో కొంతకాలం వకీలు మహమ్మద్ అలీ ఫాజిల్ దగ్గర సహాయకుడిగా పనిచేశాడు. తర్వాత సొంతూరుకు వెళ్లిన అతను మజ్లిస్ స్థానిక నాయకుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. యావదాస్తిని సంఘానికి రాసిచ్చి నాయకుల మనసులో ప్రత్యేక స్థానం సంపాదించాడు. కొద్దిరోజులకే సంస్థ పగ్గాలు చేపట్టాడు. సమయస్ఫూర్తి, వాగ్ధాటితో సామాన్యులను ఆకట్టుకున్న రజ్వీ నిజాం ప్రభుత్వాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. రజాకార్ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. హింసాత్మక ఘటనలకు కారకుడయ్యాడు. పోలీసు చర్య అనంతరం రజ్వీని భారత సైన్యం అరెస్టుచేసి తిరుమలగిరి సైనిక కారాగారంలో నిర్బంధించింది. 1957, సెప్టెంబరు11న విడుదలయ్యాడు. అదే నెల18న నగరం నుంచి ముంబైకు, అక్కడి నుంచి పాకిస్థాన్‌కు వెళ్లిపోయాడు. కరాచీలో ఒక అనామకుడిగా జీవనం సాగిస్తూ న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలుపెట్టాడు. ఒకనాడు ఈ నేలను శాసించాలనుకున్న ఇత్తేహాదుల్ సారథి 1970, జనవరి15న ఓ సాధారణ వ్యక్తిగా కన్నుమూశాడు.

నిజాం ప్రధానిమీదా రజాకార్ల దాడి

నిజాం నిరంకుశ పాలనలో సామాన్యుల మాన ప్రాణాలను హరించిన రజాకార్లు నిజాం ప్రధాని మీదా దాడి చేయడం కొంత మందికే తెలుసు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లిలోని ఓ ఆస్పత్రి ఆవరణలో తలెత్తిన ఘర్షణలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించాలన్న కాంక్షతో కొంతమంది రజాకార్లు ఆనాటి ప్రధాని అధికారిక నివాసం షా మంజిల్(ప్రస్తుతం రాజ్‌భవన్)ను ముట్టడించారు. లోపల గృహోపకరణాలకు నిప్పుపెట్టారు. అంతటితో ఆగక ప్రధానమంత్రిపై సైతం దాడికి పాల్పడ్డారని మందుముల నర్సింహారావు జ్ఞాపకాల్లో ప్రస్తావించారు.

దక్కన్ రేడియోలో స్వాతంత్ర్య ప్రకటన

భారత ఆర్మీ 1948, సెప్టెంబరు18న నగరానికి చేరింది. అంతకు ఒకరోజు ముందు సెప్టెంబర్17న ఖాసీం రజ్వీ హైదరాబాద్‌లో నరమేధానికి వ్యూహం పన్నాడు. ఈ విషయం తెలిసి ఉస్మానాబాద్ కలెక్టర్ మహమ్మద్ హైదర్ ఆనాటి నిజాం పోలీసు ఉన్నతాధికారి నవాజ్ దీన్‌యార్‌జంగ్ దగ్గరకు పరుగుతీశాడు. ఇరువురు ఫోన్‌ద్వారా రజ్వీకి నచ్చజెప్పి కల్లోలాన్ని ఆపించారు. ఈ విషయాన్ని మహమ్మద్ హైదర్ జ్ఞాపకాల్లో రాశారు. అంతకు ముందురోజే సైన్యాధ్యక్షుడు ఎల్.ఇద్రూస్ నిజాంను కలిసి సైన్యాన్ని ప్రతిఘటించడం వల్ల మరింత ప్రాణ నష్టం మినహా మరేమీ లేదని విన్నవించాడు. దీంతో సెప్టెంబరు17న మొదట ఖాసీం రజ్వీ ఖైరతాబాద్‌లోని దక్కన్ రేడియో ద్వారా తన ఓటమిని అంగీకరించాడు. ఆ తర్వాత కేఎం మున్షీతో కలిసి దక్కన్ రేడియోకు చేరుకున్న నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్.. భారత సైన్యాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో కొన్ని వందల ఏళ్ల రాచరిక పాలన నుంచి ఈ నేలకు స్వాతంత్ర్యం సిద్ధించింది. ప్రజలంతా ఆనందోత్సాహాలతో సంబురాలు చేసుకున్నారు. నగర వీధుల్లో జాతీయ జెండా ఎగరేశారు.


సర్దార్ వల్లభాయి పటేల్‌కు నమస్కరిస్తున్న నిజాం ప్రభువు

పోరాట చరిత్రను వక్రీకరించొద్దు



నిజాం వ్యతిరేక, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రతో సంబంధం లేని వాళ్లు విమోచనం అంటూ రాద్ధాంతం చేయడం సరికాదు. ఆ మహత్తర పోరాటంలో ప్రాణాలకు తెగించి మరీ పోరాడిన మేమంతా బతికుండగానే ఈ నేల చరిత్రను వక్రీకరిస్తున్నారు. త్యాగాలను అవమానిస్తున్నారు. కొత్త రాజకీయ ఎత్తుగడలో భాగంగానే వాళ్లు నాలుగేళ్లుగా విమోచనం పాటెత్తుకున్నారు. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుల సాయుధ పోరాటం వల్లే హైదరాబాద్ సంస్థానం భారత ప్రభుత్వంలో విలీనమైందనేది వాస్తవం.

- కందిమళ్ల ప్రతాపరెడ్డి, కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్

కమ్యూనిస్టులకు ఆయుధాలు అందించా



నాది భూస్వామ్య కుటుంబమే అయినా, నిజాం వ్యతిరేక పోరాటంలో చురుగ్గా పాల్గొన్నాను. అప్పట్లో హెచ్ఎస్‌సీ ప్రీ ఫైనల్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులనే వార్షిక పరీక్షలకు పంపేవారు. దీనికి వ్యతిరేకంగా ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ పెద్ద ఉద్యమమే లేవనెత్తింది. అందులో నేనూ పాల్గొన్నాను. అలా మగ్దూం, జావెద్ రజ్వీ, సీహెచ్ రాజేశ్వరరావు, రాజ్‌బహదూర్ గౌర్ లాంటి కమ్యూనిస్టు నాయకులతో పరిచయం ఏర్పడింది. నిజాం వ్యతిరేక పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులకు ఎన్నో సార్లు మందుగుండు సామగ్రి, తుపాకులు లాంటి ఆయుధాలు రహస్యంగా అందించాను. కొన్నాళ్లు రహస్య జీవితం గడిపాను. కమ్యూనిస్టు పార్టీ చైతన్యంతో వారసత్వంగా వచ్చిన వందల ఎకరాల భూమిని పంచాను.

- మహ్మద్ ఖాజా మొయినుద్దీన్, నిజాం వ్యతిరేక పోరాటయోధుడు, 99ఏళ్లు

భయంతో ఆస్తులమ్మారు



పోలీసు యాక్షన్‌కు వారం ముందు 'బక్రీదుకు గొర్రెలను కాదు, హిందువుల తలలు నరుకుతాం. వాళ్ల రక్తంతో హోలీ ఆడతాం' అని రజాకార్ నాయకుడు ఖాసీం రజ్వీ ప్రకటించినట్లుగా నగరమంతా వదంతులు వ్యాపించాయి. దాంతో హిందువులంతా భయంతో ఆస్తిపాస్తులు అమ్ముకొని బతికినన్నాళ్లు అయినా ఆనందంగా జీవించాలని విందులు చేసుకున్నారు. అదే సమయంలో భారత సైన్యం ప్రవేశించడంతో నిజాం లొంగిపోయాడని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు. యుద్ధ ట్యాంకులు, వాహనాలకు పూలమాలలు వేసి, భారత జవానులకు లడ్డూలు తినిపిస్తూ సంబురాలు చేసుకున్నారు. ముస్లింలంతా రజాకార్లు కాదు. ఆ సమయంలో రజాకార్ల దాడినుంచి ఎంతోమంది హిందువులను ముస్లింలు కాపాడారు. ఈ విషయాలన్నీ ప్రత్యక్ష సాక్షి మా అక్కచెప్పగా నాకు తెలిశాయి.

- పరవస్తు లోకేశ్వర్, నగర చరిత్ర పరిశోధకుడు

ధాన్యం దోపిడీ..


గత నెలలో పెబ్బేరు వద్ద పట్టుబడిన ధాన్యం లారీ (ఫైల్)

(5వ పేజీ తరువాయి)

దగ్గరుండి సహకరిస్తున్నారు.

నామమాత్రపు చర్యలు..

సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయించిన తర్వాత పక్క రాష్ట్రాల్లో ఎక్కువ ధర లభిస్తుండటంతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దాని స్థానంలో రైస్ మిల్లర్ల సంఘం ఆధ్వర్యంలో రేషన్ డీలర్ల ద్వారా బియ్యం రీసైక్లింగ్ చేసి.. వాటిని కొద్దికొద్దిగా సీఎస్‌సీకి తరలిస్తున్నారు. వారు అధికారులను మేనేజ్ చేస్తున్నారు. గత నెల 14న పెబ్బేరు మండలంలో సీసీఎస్ పోలీసులు పట్టుకున్న లారీ విషయంలో సైతం విచారణలో కాలయాపన చేసి.. సరైన పద్ధతిలో ఎంక్వైరీ చేయకుండా చివరకు ఒకే ఒక లైన్ రిపోర్టుతో క్లీన్‌చిట్ ఇచ్చి విడుదల చేశారు. ప్రభుత్వ ముద్రణతో ఉన్న బస్తాల్లో ధాన్యం తరలిస్తున్న మిల్లర్ డీలర్ల వద్ద సంచులు కొనుగోలు చేశారని చెప్పి.. నామమాత్రపు జరిమానా విధించారు. సదరు మిల్లులో ఉండాల్సిన ధాన్యం కంటే అధికంగా ఉన్నా ఆ కోణంలో విచారణ కూడా చేయలేదు. అలాగే గతవారం పెబ్బేరు మండలంలోని శాఖాపూర్‌లో అద్వైత్ మిల్లు నుంచి కర్ణాటకలోని రాయిచూరుకు తరలిస్తున్న ధాన్యం లారీని పట్టుకున్న అధికారులు విచారణ చేస్తున్నారు. మరి ఆ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో తేలాల్సి ఉంది. ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నప్పటికీ.. పౌరసరఫరాల శాఖలోని కొందరు అధికారులు తప్పుడు నివేదికలు అందజేస్తూ అక్రమార్కులను తప్పిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ నెల మొదటివారంలో కోస్గిలోని ఓ రైస్‌మిల్లు నుంచి ధాన్యం తరలిస్తుండగా.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలంలోని కొందరు పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. తర్వాత లారీలో ధాన్యాన్ని పరిశీలించిన అధికారులు సీజ్ చేశారు. మూడు రోజుల తర్వాత తాము జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని రాధిక అగ్రోటెక్‌కు ధాన్యం తరలిస్తున్నట్లు పత్రాలు సృష్టించారు. ఒకవేళ ముందస్తుగానే వారి వద్ద పత్రాలు లేకుండా వాటిని తరలించారా? అనేది ఇక్కడ అనుమానాలకు తావిస్తోంది.

నయా రేషన్ డాన్..

ప్రధానంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో వనపర్తిలో సీఎంఆర్ అక్రమాలు అధికంగా జరుగుతున్నాయి. ధాన్యం ఉత్పత్తి, మిల్లర్లు ఇక్కడే అధికంగా ఉండటంతో అక్రమాలు కూడా భారీగా ఉన్నాయి. అక్రమాలు వెలుగులోకి వచ్చినప్పుడు మాత్రం రైస్ మిల్లర్ల సంఘం నాయకులు కొందరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. పట్టుబడిన ధాన్యాన్ని, లారీలను విడిపించడం, అధికారులను మేనేజ్ చేయడం, ప్రారంభం కాని రైస్ మిల్లులకు ఎలాంటి అనుమతులు లేకున్నా ధాన్యం కేటాయింపులు చేయించడం వంటి పైరవీలు చేస్తున్నారు. ఎప్పుడు వెళ్లినా వనపర్తి రైస్‌మిల్లర్ల సంఘం నాయకులు పౌర సరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థ కార్యాలయాల చుట్టూనే కనిపిస్తుంటారు. అంతలా అధికారులతో ఏం పని ఉంటుందో కూడా తెలియని పరిస్థితి. సంఘం ఓ నాయకుడికి సంబంధించిన మిల్లులను కూడా గతంలో బ్లాక్ లిస్టులో పెట్టి తిరిగి కేటాయింపులు చేశారు. రోజూ పైరవీలతోనే అధికారుల చుట్టూ తిరుగుతున్న ఆయనను నయా రేషన్ డాన్ అని పిలుస్తుండటం గమనార్హం. గతంలో ఒక రేషన్ డాన్ వనపర్తి జిల్లాలో ఉండగా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ నాయకులకు సహకరించారనే కారణంతో ఆయన్ను తొక్కిపెట్టారు. ఇప్పుడు ఈ నయా రేషన్ డాన్ ఆధ్వర్యంలోనే రైస్ మిల్లర్లు అక్రమ దందాను మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగిస్తున్నారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం

» గొడుగులు పట్టుకొని విద్యార్థుల ర్యాలీ

» ఘనంగా అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం



మాగనూరు/కృష్ణ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఓజోన్ పొరను కాపాడుకుందామని విద్యార్థులు నినదించారు. నారాయణపేట జిల్లా, మాగనూరు మండల పరిధిలోని వడ్వాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గురురాజారావు ఆధ్వర్యంలో విద్యార్థులు గొడుగులు పట్టుకొని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కృష్ణ మండల పరిధిలోని కున్సి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనూ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఓజోన్ పొరను కాపాడుకుందాం అంటూ గొడుగులు పట్టుకొని వృత్తాకారంలో నిలబడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, సౌమ్య, గీత, నాగేశ్ పాల్గొన్నారు.

పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు

అలంపూరు చౌరస్తా, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అలంపూరు సీఐ రవిబాబు, ఉండవల్లి ఎస్ఐ ఆర్.శేఖర్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం తదితర కారణాలతో 80 వాహనాలకు జరిమానా విధించారు. డ్రైవర్లు, యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే అలంపూర్, మల్దకల్ ప్రాంతాల్లోనూ వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని, నిబంధనలను పాటించని 36 వాహనాలపై కేసులు నమోదు చేశారు. వాటిలో 8 స్కూలు బస్సులు ఉన్నాయి. తనిఖీల్లో ఎంవీఐ రాములు, ఏఎంవీఐ సాయిశ్రుతి, సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కోసం పోరు

» నెల రోజులుగా అదే తీరు

» నారాయణపేటలో రైతుల రాస్తారోకో

» పలుచోట్ల పీఏసీఎస్‌ల వద్ద బారులు

» పోలీసు పహారాలో యూరియా పంపిణీ

» బిజినేపల్లిలో తోపులాట

» తెగిపోయిన మహిళ పుస్తెల తాడు


భూత్పూర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

నారాయణపేట/ పెబ్బేరు/ భూత్పూర్/ చిన్నచింతకుంట/ పెద్దకొత్తపల్లి/ హన్వాడ/ దేవరకద్ర/ బిజినేపల్లి, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పంటల సాగుకు అవసరమైనంత యూరియా లభించకపోవడంతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. విసిగి వేసారి ఆందోళనలకు దిగుతున్నారు. గత నెల రోజులుగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

● నారాయణపేట ఆర్టీసీ బస్టాండు ముందున్న అంబేడ్కర్ చౌరస్తాలో, అంతర్రాష్ట్ర రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. వారికి కార్మిక సంఘం నాయకులు కెంచి నారాయణ, నర్సింహ, సాయినాథ్ సాధిక్ తదితరులు మద్దతు తెలిపారు. రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు అధిక సంఖ్యలో నిలిచిపోయాయి. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామని రైతులు స్పష్టం చేశారు. దీంతో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ అంబేడ్కర్ చౌరస్తాకు చేరుకొని రైతులతో మాట్లాడారు. అందరికీ టోకెన్లు ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారు వ్యవసాయ శాఖ కార్యాలయానికి చేరకోగా, రైతులందరికీ టోకెన్లు పంపిణీ చేశారు.

● వనపర్తి జిల్లా, పెబ్బేరు మునిసిపాలిటీలోని మన గ్రోమోర్ కేంద్రం, మండలంలోని రంగాపూర్ గ్రామంలోని రైతు వేదికల వద్ద పోలీసు పహారా మధ్య రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. పెబ్బేరు మండలంలో ఇప్పటివరకు 800 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేసినట్లు ఏవో షేక్ మున్నా తెలిపారు. ఇంకా 150 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేస్తే సమస్య తీరుతుందని చెప్పారు.

● మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కేంద్రంలోని మన గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణాన్ని మంగళవారం ఉదయం 9:30 గంటలకు తెరిచారు. 2 గంటల పాటు రైతులకు యూరియా పంపిణీ చేశారు. అనంతరం యూరియా అయిపోయిందని దుకాణం యజమాని, వ్యవసాయ శాఖ అధికారి చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఆందోళన దాదాపు 2 గంటల పాటు కొనసాగడంతో కిలోమీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకొని నచ్చచెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

● హన్వాడ మండల కేంద్రంలోని తాండూరు - మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రైతులు ఆందోళన చేపట్టారు. యూరియా వస్తుందని పోలీసులు వారికి నచ్చచెప్పడంతో ఆందోళన విరమించారు.

● మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండల కేంద్రంలోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణం ముందు రైతులు తెల్లవారుజాము నుంచే పాదరక్షలను వరుసలో ఉంచి ఎదురు చూశారు. అందుబాటులో ఉన్న మేర రైతులకు యూరియా పంపిణీ చేశారు.

● దేవరకద్ర, మండల కేంద్రంలోని మన గ్రోమోర్ కేంద్రం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. శుక్రవారం టోకెన్లు తీసుకున్న వారికి యూరియాను పంపిణీ చేశారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు గంటల తరబడి పడిగాపులు కాశారు. ఎంత ఎదురుచూసినా అందరు రైతులకు టోకెన్లు కానీ, యూరియా కానీ దొరకడం లే టదని వాపోయారు.

● బిజినేపల్లి మండల కేంద్రంలో యూరియా కోసం మహిళా రైతులు అధిక సంఖ్యలో బారులు తీరారు. ఎదరుచూసి విసిగిపోయిన రైతుల మధ్య తోపులాట జరిగింది. ఆ సమయంలో రామావత్ లలిత అనే మహిళ పుస్తెల తాడు తెగిపోయింది. వెంటనే చూసుకొని వెతకడంతో ఒక పుస్తె దొరికింది. మరొకటి కనిపించలేదు. యూరియా కోసం వస్తే పుస్తె పోయిందని ఆమె కన్నీరు పెట్టుకున్నది.

● ఆత్మకూరు : వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికే యూరియా పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి వినయ్ కుమార్ తెలిపారు. మంగళవారం 280 బస్తాల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. బుధవారం 300 బస్తాల యూరియాను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

● నర్వ : నారాయణపేట జిల్లా, నర్వ మండల కేంద్రంలోని పీఏసీఎస్, మన గ్రోమోర్ కేంద్రాల ఎదుట తెల్లవారుజామున మూడు గంటల నుంచే రైతులు బారులు తీరారు. అందుబాటులో ఉన్న మేరకు రైతులకు యూరియా పంపిణీ చేశారు. మిగిలిన వారికి టోకెన్లు ఇచ్చారు.

క్రైం కార్నర్

అదుపు తప్పి కంటైనర్‌ను ఢీకొన్న కారు

» ఒకరికి తీవ్ర, ముగ్గురికి స్వల్ప గాయాలు



కంటైనర్ కిందికి దూసుకెళ్లి ఇరుక్కుపోయిన కారు

పెబ్బేరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఓవర్‌టేక్ చేసే యత్నంలో కారు అదుపు తప్పి ముందు వెళ్తున్న కంటైనర్‌ను ఢీకొనడతో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. వనపర్తి జిల్లా, పెబ్బేరు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఈ సంఘటన జరిగింది. పెబ్బేరు ఎస్‌ఐ దివ్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌రావు భార్య రమాదేవి, కుమారులు సతీష్‌చంద్ర, యశ్వంత్ చంద్రలతో కలిసి కారులో కోయంబత్తూరులోని ఆదియోగి క్షేత్రానికి వెళ్తున్నారు. జాతీయ రహదారిపై పెబ్బేరు సమీపంలో ముందు వెళ్తున్న కంటైనర్ లారీని ఓవర్‌టేక్ చేసే యత్నంలో కారు అదుపు తప్పి ఎడమ వైపు దానికి కిందకు దూసుకెళ్లి చిక్కుకుపోయింది. విషయాన్ని గ్రహించని కంటైనర్ డ్రైవర్ వాహనాన్ని ఆపకపోవడంతో అరకిలోమీటరు మేర కారును ఈడ్చుకెళ్లింది. అయితే ప్రమాదం జరుగగానే కారులోని బెలూన్లు తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. కారు నడుపుతున్న సతీష్ చంద్ర తలకు తీవ్రగాయమైంది. యశ్వంత్‌చంద్రతో పాటు తల్లిదండ్రులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు స్థానిక సరోజిని ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, జాతీయ రహదారి సిబ్బంది రోడ్డుపై అడ్డంగా ఉన్న వాహనాలను తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. బాధితుల ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దివ్య తెలిపారు.

ద్విచక్రవాహనం, బొలెరో ఢీ

» అక్కడికక్కడే యువకుడి మృతి

మిడ్జిల్, సెప్టెంబరు 16:(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనం, బొలెరో ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి సమీపంలో ఈ సంఘటన జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ శివారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిలువేరు గ్రామానికి చెందిన జక్క అనిల్‌కుమార్(28) ద్విచక్రవాహనంపై జడ్చర్లకు వెళ్తున్నాడు. కొత్తపల్లి బస్‌స్టేజీ సమీపంలో ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని వెనుకనుంచి ఢీకొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య అనూష, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనపై మృతుడి మేనబావ మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు శివారెడ్డి తెలిపారు.

బైకు, డీసీఎం ఢీ : యువకుడికి గాయాలు

వీపనగండ్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వీపనగండ్ల శివారులోని అంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం బైకు, డీసీఎం ఢీకొన్న సంఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా ఎమ్మనబెట్ల గ్రామం నుంచి గొర్రెలతో డీసీఎం పెబ్బేరు వైపు వెళ్తుంది. పెబ్బేరు వైపు నుంచి బొల్లారం గ్రామానికి చెందిన నాగరాజు బైక్‌పై వెళ్తూ.. వీపనగండ్ల ఆంజనేయస్వామి ఆలయం వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. సంఘటనలో బైక్‌పై ఉన్న నాగరాజు మోకాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పెబ్బేరుకు తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ తీసుకెళ్లినట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

ఆత్మకూరు ,సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల పరిధిలోని జూరాల శివారులో ఉన్న కృష్ణానది ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ నరేందర్, గ్రామ పంచాయతీ కార్మికుడు భీమన్న తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన వాకిటి రాజు చేపల వేట కోసం నది వద్దకు వచ్చాడు. అక్కడ ఓ మూల వద్ద కుళ్లిన స్థితిలో పడి ఉన్న మృతదేహం కనిపించింది. అది దాదాపు 10 నుంచి 15 రోజుల క్రితం నదిలో కొట్టుకు వచ్చి ఉండొచ్చని స్థానికులు తెలిపారు. గ్రామ పంచాయతీ వర్కర్ భీమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక డంపుల సీజ్

మిడ్జిల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను అధికారులు సీజ్ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని కొత్తపల్లి శివారులో అక్రమంగా ఇసుక డంపులను ఏర్పాటు చేసినట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ శివనాగేశ్వరనాయుడుల ఆదేశం మేరకు కానిస్టేబుల్ వెంకటేశ్, వీఆర్‌ఏ పాపయ్య వాటిని పరిశీలించి సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రాత్రి వేళ నిఘా ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ తెలిపారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

» నలుగురికి గాయాలు



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

దేవరకద్ర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల మధ్య ఘర్షణ జరగడంతో నలుగురు గాయపడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో జరిగింది. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులు కొందరు చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. ఈ విషయాన్ని అదే తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు ఉపాధ్యాయులకు చెప్పినట్లు వారు అనుమానించారు. ఆదివారం రాత్రి 11 గంటలకు గది తలుపులు మూసేసి, ఆ నలుగురు విద్యార్థులపై దాదాపు 30 మంది తీవ్రంగా కొట్టారు. ఎవరికైనా చెప్తే మళ్లీ కొడతామని బెదిరించారు. కానీ ఈ విషయం వంట మనిషి ద్వారా ప్రిన్సిపాల్ వెంకటేశ్‌కు తెలిసింది. దీంతో ఆయన బాధిత విద్యార్థులతో మాట్లాడి సంఘటన గురించి తెలుసుకున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగన్న పాఠశాలకు వెళ్లి వారితో మాట్లాడారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

తుపాకి గుండ్లకు గుండె చూపి..

» లెవీకి వ్యతిరేకంగా అయిజ వాసుల పోరుబాట
» నిజాం సైన్యంపై తిరగబడిన ప్రజలు
» కాల్పుల్లో అమరులైన ఐదుగురు
» వారి పేరుతో స్మారక స్తూపం
» నేడు తెలంగాణ విమోచన దినోత్సవం



అయిజ పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం



గాంధి విగ్రహం కింద ఉన్న అమరుల శిలాఫలకం

అయిజ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిజాం సైన్యం తుపాకి గుండ్లకు గుండె చూపి అమరులైన అ యిజ ప్రజల వీర గాథ ఇది. రాజాకార్ల దమన కాండకు ఎదురు నిలిచి పోరాడిన చరిత్ర ఇది. తెలంగాణ విమోచనదినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

నిజాం సర్కార్ అమలు చేస్తున్న లేవీపై జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ వాసులు పోరుబాట పట్టారు. 1947 - 1948లో అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో తీవ్ర కరువు కాటకాలు సంభవించాయి. వేసిన పంటలు ఎండిపోయి, తినడానికి తిండిగింజలు కూడా దొరకక జనం అల్లాడి పోయారు. పశువులకు గ్రాసం కూడా లభించడం కష్టతరంగా మారింది. ఆ దుర్భిక్ష కాలంలో అప్పటి నైజాం సర్కార్ లేవీ (ధాన్యం) పన్ను ప్రవేశ పెట్టింది. అప్పటికే వివిధ రకాల పన్నులు చెల్లించలేక జనం విసిగి వేసారి పోయారు. అయినా లేవీ చెల్లించి తీరాల్సిందే అంటూ ప్రజలపై సర్కారు దమన కాండకు దిగింది. ప్రజలు నిల్వ చేసుకున్న కొద్ది పాటి ధాన్యంతో పాటు, పెంచుకున్న పశువులను కూడా బలవంతంగా లాక్కెళ్తున్నారు. దౌర్జన్యం, దమన కాండలతో విసిగిపోయి పిడికిలెత్తి పోరుబాట పట్టారు. అందులో భాగంగా లేవీ చెల్లింపును నిరాకరిస్తూ అయిజ గ్రామస్థులు ప్రాణాలకు తెగించి పోరుకు సిద్ధం అయ్యారు.

నిఘా సమాచారంతో అప్రమత్తం

ఈ విషయంపై నిఘా వర్గాలు సమాచారం అందించడంతో నిజాం నవాబు అప్రమత్తం అయ్యాడు. 1947, డిసెంబర్ 12న అయిజ ప్రజల ఉద్యమాన్ని అణచివేసేందుకు 100 మంది పోలీసులు, 300 మంది అరబ్బు సైనికులను ఆయుధాలతో అయిజ పంపించారు. వారికి రజాకార్లు తోడయ్యారు. అయినా ప్రజలు భయపడకుండా వారిపై తిరగబడ్డారు. అందుబాటులో ఉన్న రాళ్లు, కర్రలు, కారంపొడితో ఎదురుదాడికి దిగారు. దీంతో నిజాం సైనికులు వారిపై లాఠీలతో దాడి చేశారు. చివరకు తుపాకులతో కాల్పులు జరిపారు. కాల్పుల్లో 5 గురు అమరులయ్యారు. అంతటితో ఆగక రజాకార్లు దాదాపు 300 మంది ఉద్యమకారులను అదుపులోకి తీసుకున్నారు. వారి కాళ్లు, చేతులకు ఇనుప సంకెళ్లు వేసి నడిపించుకుంటూ 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న గద్వాలకు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న నడిగడ్డకు చెందిన తెలంగాణ పోరాటయోధులు కూడబలుక్కున్నారు. అయిజ పోలీసుస్టేషన్‌పై బాంబులు వేశారు. హైదరాబాద్ విలీనోద్యమంలో భాగంగా జరిగిన ఈ లెవీ నిరాకరణ పోరాటంలో ప్రాణాలు అర్పించిన 5గురు ఉద్యమకారుల జ్ఞాపకార్థం, సంఘటన జరిగిన స్థలంలో అయిజ మండల స్వాతంత్ర్య సమర యోధుల ఆధ్వర్యంలో 1955లో స్థూపాన్ని నిర్మించారు. గాంధీజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి అమరులైన నాయకి చిన్న తిమ్మప్ప, కల్లె బీచిగాడు, కొండాపురం నర్సప్ప, పాగుంట వెంకటయ్య, బలిజ నాగయ్యల పేర్లతో శిలాఫలకాన్ని ఉంచారు. ఆ స్థూపాన్ని 1999లో ఆధునికీకరణ చేసినట్లు దానిపై ఉన్న సమాచారాన్ని బట్టి తెలుస్తున్నది.

విమోచన దినోత్సవాన్ని జరపడానికి భయమెందుకు?

» బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ



ఊట్కూర్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నామాజీ

ఊట్కూర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజాం రజాకార్ల నుంచి విముక్తి కల్పించిన తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజున తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడానికి ప్రభుత్వానికి భయమెందుకని బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ ప్రశ్నించారు. మంగళవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ స్వాతంత్ర్యం కోసం అనేకమంది పోరాటం చేశారని, వారి బలిదానాలకు విలువలేదా అని అన్నారు. ప్రజాపాలన దినోత్సవం జరుపుకుంటామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ 50 ఏళ్లుగా ఆ పార్టీ పరిపాలన చేసిందని, అప్పుడు ప్రజాపాలన లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి విమోచన దినం అనడానికి ధైర్యం లేదని అన్నారు. ప్రభుత్వం చేసినా, చేయకపోయినా గ్రామగ్రామాన తెలంగాణ విమోచన దినోత్సవం రోజున త్రివర్ణ పతాకం ఎగురవేసి జరుపుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ కొండన్‌గోపాల్, మాజీ మండల అధ్యక్షుడు కె.రమేష్, నాయకులు ఉన్నారు.

కేంద్ర మంత్రిని సన్మానించిన ఎంపీ డీకే అరుణ



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌ను సన్మానిస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు రాగా, మంగళవారం బేగంపేట విమానాశ్రయంలో ఆయకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపీలు లక్ష్మణ్, ఈటల రాజేందర్, కొండావిశ్వేశర్‌రెడ్డి, రఘునందన్‌రావు, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, కొమురయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

» రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) :ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మీ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తసుకెళ్తానని భరోసా ఇచ్చారు. మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్ రెడ్డి, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు సచివాలయంలో మంత్రి పొన్నంను కలిసి సమస్యలు విన్నవించారు. విశ్రాంత ఉద్యోగులకు ఆహారభద్రత కార్డు, ఆసరా పింఛన్, విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి స్థలం, 2017 నుంచి 2021 వరకు పీఆర్‌సీ ఇప్పించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మాయపల్లి శ్రీనివాసులు, కార్యదర్శి టీఎస్ఎస్‌రెడ్డి, గద్వాల బసప్ప, వనపర్తి సత్యన్న, నారాయణపేట నాగేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని సత్కరించిన భూనిర్వాసితుల సంఘం నాయకులు

నారాయణపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.20 లక్షలు చెల్లించేలా సీఎంను ఒప్పించడంతో మంగళవారం రాత్రి నారాయణపేట పట్టణంలోని సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని భూనిర్వాసితుల సంఘం నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో భూనిర్వాసితుల సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, అధ్యక్షుడు మశ్చేందర్, ఉపాధ్యక్షుడు ధర్మరాజుగౌడ్, గోపాల్‌రెడ్డి, బల్‌రామ్ తదితరులున్నారు.

జ్వరంతో వెళ్తే.. కుక్క కాటు ఇంజక్షన్

» వైద్య సిబ్బంది నిర్లక్ష్యం



దేవరకద్ర ప్రభుత్వ ఆసుపత్రి

దేవరకద్ర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జ్వరంతో బాధపడుతున్న ఓ వ్యక్తి చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా, నర్సు నిర్లక్ష్యంతో వైద్యుడు రాసిన చిట్టీని సరిగా చూడకుండా కుక్క కాటు ఇంజక్షన్ ఇచ్చింది. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్రలో జరిగింది. మండల పరిధిలోని బల్సుపల్లికి చెందిన నాగరాజు అనే వ్యక్తి మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం సోమవారం దేవరకద్రలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చాడు. వైద్యుడు పరీక్షించి, 3 రోజుల పాటు ఇంజక్షన్లు తీసుకోవాలని చిట్టీ రాసి ఇవ్వగా, నర్సు దాన్ని పరిశీలించి అతడికి ఇంజక్షన్ ఇచ్చింది. డాక్టర్ సూచన మేరకు మంగళవారం ఉదయం అతడు ఆసుపత్రికి వెళ్లి నర్సుకు చీటీ చూపించాడు. ఆమె దాన్ని సరిగా చదవకుండా 'కుక్క కరిచిందా' అని అడిగింది. ఏదో ఆలోచనలో ఉన్న అతడు 'ఊ' అనడంతో అతడికి కుక్క కాటు ఇంజక్షన్ చేసింది. అయితే ముందు రోజు నడుముకు ఇంజక్షన్ ఇవ్వడం, ఇప్పుడు చేతికి ఇవ్వడంతో అతడికి అనుమానం వచ్చింది. ఈ విషయాన్ని నర్సును అడగడంతో కుక్క కాటు ఇంజక్షన్ ఇచ్చినట్లు చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన నాగరాజు వైద్యుడిని సంప్రదించడంతో అవసరమైన చికిత్స చేశారు. ఎలాంటి ఇబ్బందీ ఉండదని చెప్పడంతో ఇంటికి వెళ్లిపోయాడు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

కోయిలకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలంలోని మోదీపూర్ గ్రామంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. రైతు రాజుకు చెందిన పాడి గేదె మంగళవారం పొలంలో మేతమేస్తూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. దాని పక్కనే ఉన్న విద్యుత్ తీగకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే చనిపోయింది. దాని విలువ దాదాపు రూ.1.20 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపారు.



విద్యుదాఘాతంతో చనిపోయిన గేదె

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో భాగంగా టాస్క్ ఆధ్వర్యంలో ప్రోగ్రామింగ్ స్కిల్స్ సీ లాంగ్వేజ్, జావా పండమెంటల్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్ పైథాన్ ప్రోగ్రామింగ్‌లో శిక్షణ కోసం ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని టాస్క్ రీజినల్ సెంటర్ రాష్ట్ర ఇన్‌చార్జి నవీన్‌రెడ్డి, జిల్లా మేనేజర్ సిరాజ్ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు, రైల్వే స్టేషన్ సమీపంలో గల టాస్క్ కార్యాలయంలో వివరాలు అందజేయాలన్నారు.

యోగా క్రీడాకారుడికి అభినందన



పతకం సాధించిన వెంకటేశ్‌ను అభినందిస్తున్న ఎస్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నల్గొండ జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన యోగా క్రీడాకారుడు సీనియర్ విభాగంలో వెంకటేశ్ కాంస్య పతకం సాధించాడు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఎస్పీ వెంకటేశ్ అభినందించారు.

అక్రమాలు జరిగితే చర్యలు తప్పవు



గ్రామస్థులతో మాట్లాడుతున్న రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సురేఖ, మైనింగ్ సర్వేయర్ సుజాత

పాన్‌గల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) :నాగర్‌కర్నూల్ జిల్లా, పాన్‌గల్ మండల పరిధిలోని రేమద్దుల గ్రామ శివారులో తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని మైనింగ్ అధికారులు పరిశీలించారు. పట్టా భూముల్లో మైనింగ్ తవ్వకాలు చేపట్టారని రేమద్దుల వాల్యానాయక్ తండా రైతులు హైదరాబాదులోని ప్రజా భవన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా అధికారులు, మైనింగ్ సర్వే అధికారి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. లీజుకు ఇచ్చిన సర్వే నెంబర్లలోనే తవ్వకాలు చేపట్టినట్లు మైనింగ్ నిర్వాహకులు అధికారులకు తెలిపారు. అయితే మండల సర్వేయర్ రాకపోవ డంతో భూమిని సర్వే చేయడం లేదని అధికారులు తెలిపారు. దీంతో మరోసారి తేదీని ప్రకటించి పూర్తి స్థాయిలో సర్వే చేస్తామని నిర్వాహకులకు, ఫిర్యాదుదారులకు తెలిపారు. పట్టా భూముల్లో అక్రమంగా మైనింగ్ చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అనుమతి తీసుకున్న సర్వే నెంబర్లలోని భూమిలో మైనింగ్ చేసుకో వచ్చని నిర్వాహకులకు తెలిపారు. కార్యక్ర మంలో సిబ్బంది సురేఖ, సుజాత, మహేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం

CHANGE OF NAME

★ I, Gouni Brahmananda Reddy, S/o Late Pedda Linga Reddy, age 67 years, residing at 2-10, Fareedpur, Mahabubnagar, hereby state that my name appears as "Brahmaiah G in my son's SSC records". Both names refer to me only. AJH-3025

ANDHRA JYOTHI CLASSIFIEDS
3+1 Scheme
ప్రతి 4 లైన్లకు 200/- రూ.
ప్రతి అదనపు లైను 45/- రూ.
9985411175
9550413644
ఆంధ్రజ్యోతి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడిపిటి

న్యూస్ బాక్స్

ఉపాధ్యాయుడికి సన్మానం

మిడ్జిల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బైరంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడి విధులు నిర్వహిస్తూ బదిలీపై నవాబ్‌పేట మండలం లింగంపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు వెళ్తున్న వినోద్‌కుమార్ మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. హెచ్‌ఎం డానింగ్‌టన్, ఉపాధ్యాయులు పూర్ణ, మంజుల, శ్రావణి పాల్గొన్నారు.

చర్చి ప్రారంభోత్సవానికి ఆహ్వానం

చిన్నచింతకుంట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెమాన్ గ్రామంలో ఈనెల 25, 26, 27, 28 తేదీల్లో నూతన మందిరం ప్రారంభోత్సవానికి రావాలని మంగళవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సమితి చైర్ పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఎంబీ మిస్త్రా సంఘం నాయకులు రాజేందర్, పాస్టర్ పరంజ్యోతి, యేసేపు, పౌలు, నరసింహా, చంద్రన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు దస్త్రాలు అప్పగింత

దేవరకద్ర, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బస్వాయపల్లి గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తి తన తాత పేరిట ఉన్న భూమిని తన పేరుపైకి మార్చాలని సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీంతో ఉన్నతాధికారల ఆదేశాల మేరకు దేవరకద్ర తహసీల్దార్ దీపిక పట్టా మార్పిడి కోసం శంకర్‌కు దరఖాస్తు చేసుకున్న దస్త్రాలను సోమవారం రాత్రి కలెక్టర్‌కు అపగించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీల్లో మెరుగైన విద్య

కోయిలకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యను కూడా అందించడం జరుగుతుందని సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, వెంకటేశ్వరి, జగదీశ్వరి తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీరామకొండ రైతు వేదికలో మంగళవారం పోషణ్ బీ, పడాయ్ బీ పై అంగన్‌వాడీ టీచర్లుకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరింత విద్యా ప్రమాణాలు పెంచుటకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

- కలెక్టర్ విజయేందిర బోయి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యా ప్రమాణాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత విద్యాశాఖ, ఇంటర్మీడియట్, విద్య, సంక్షేమ, గురుకుల పాఠశాలల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక వసతులైన టాయిలెట్, విద్యుత్, తాగునీరు తదితర సౌకర్యాలు అవసరముంటే ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. తల్లిదండ్రుల, పిల్లల ఆధార్ కార్డులో అడ్రస్, పేరు వంటివి సరిగ్గా లేకుంటే సరిచేయించుకొని విద్యార్థులందరూ అపార్ ఐడీని జనరేట్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేజీబీవీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఎన్ని సీసీటీవీలు ఉన్నాయి? ఎన్ని పనిచేస్తున్నాయని? ఆర్వో వాటర్ ప్లాంట్లు, కంప్యూటర్, బిల్లింగ్ రిపేర్లను సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎఫ్ఎ-1, ఎఫ్ఎ-2 పరీక్షలపై ఆరా తీశారు. ఈనెల 22 నుంచి నిర్వహించే ఓపెన్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలు నిరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీఈవో ప్రవీణ్‌కుమార్, డీఐఈవో కౌసర్‌జహాన్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

గండీడ్ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం మండలంలోని పల్లె దవాఖాన, ఆయుష్ ఆరోగ్య మందిరం, అంగన్‌వాడీ, గిరిజన సంక్షేమ మినీ గురుకుల పాఠశాల, బీసీ బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గిరిజన సంక్షేమ మినీ గురుకు బాలికల పాఠశాలలో మెనూ ప్రకారం ఇడ్లీ పెట్టాల్సి ఉండగా, టమాట రైస్ ఏంటని మరియు మధ్యాహ్న భోజనంలో చారు, పప్పు ఒకేలా ఉండడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గండీడ్ బీసీ బాలుర వసతి గృహంలో అదనపు తరగతి గదులకు అంచనాలు తయారు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పగిడ్యాలలో పల్లె దవాఖాన, ఆయుష్, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. బీసీ సంక్షేమ అధికారిని ఇందిర, ఎంపీడీవో హరిచంద్రారెడ్డి, గండీడ్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



ప్రైవేట్ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. ప్రైవేట్ పాఠశాలలో ఫీజులు అధికంగా ఉంటాయని, కానీ ఉపాధ్యాయులకు తక్కువ వేతనాలు ఉంటాయన్నారు. పట్టణంలోని చంద్రా గార్డెన్స్‌లో మంగళవారం జడ్చర్ల రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (జేఆర్ఎస్ఎంఏ), జడ్చర్ల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలోని ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదని, నిస్వార్థమైన సమాజ సేవ అని కొనియాడారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడటంలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల పాత్ర అపారమైందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, హెల్త్‌కార్డులకు సంబంధించిన అంశంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. దసరా వేడుకల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆహ్వానించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారులు బాదిమి శివకుమార్, మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, ఎంఈవో మంజులాదేవి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, ప్రధానకార్యదర్శి నరేశ్, సభ్యులు విష్ణువర్దన్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

రేపు చికెన్, మటన్, చేపల వ్యర్థాల తొలగింపునకు వేలం

జడ్చర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల తొలగింపునకు ఈ నెల 18న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి సంబంధించి మునిసిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 11న నిర్వహించాల్సిన వేలం అనివార్య కారణాలతో వాయిదా పడిందన్నారు

వైద్య శిబిరం విజయవంతం

జడ్చర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నసరుల్లాబాద్ గ్రామంలో గంగాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. పీహెచ్‌సీ డాక్టర్ ప్రతాప్‌చౌహన్ నేతృత్వంలో 150 మందికి బీపీ, షుగర్, టీబీ, హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. స్వస్థనారి సశక్త్ పరివార్‌లో భాగంగా బుధవారం గంగాపురం పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రతాప్‌చౌహన్ తెలిపారు.

భవన నిర్మాణానికి స్థల పరిశీలన

హన్వాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలో భవిత కేంద్ర భవన నిర్మాణానికి మంగళవారం అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ స్థలాన్ని పరిశీలించారు. అయితే స్థలం తక్కువ ఉందని, మరో చోట పరిశీలించనున్నట్లు తెలిపారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

గండీడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : చిరు ధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యమని డీపీఎం అరుణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మిల్లెట్స్ యూనిట్‌ను ఏపీఎం రవితో కలసి పరిశీలించారు. త్వరలో జరిగే ఎస్ఏఆర్ఏఎస్ ఎగ్జిబిషన్ కోసం రొట్టెలు, బిస్కెట్లు తయారు చేయడాన్ని పరిశీలించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

జడ్చర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీఎఫ్ మండల టోర్నమెంట్‌తో పాటు సెలక్షన్స్ కార్యక్రమాన్ని మంగళవారం బాదేపల్లి బాలుర జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. అండర్-17, అండర్-14 విభాగాలలో బాల, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పోటీలలోని విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈవో మంజులాదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్ కల్యాణ్, శారదాబాయి, నిరంజన్, సోమ్లానాయక్, ఖాజా, ప్రశాంతి, శివప్రసాద్, విజయ్‌ప్రసాద్, సందీప్, బస్నీరాజ్, సుస్మిత్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ

హన్వాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాదారం, యారోనిపల్లి, టంకర, తిరుమలగిరి గ్రామాల్లో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. వీర తెలంగాణ సాయుధ రైతంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ చేపట్టారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ నాయకులు రాములు, తిరుమలగిరి రాములు, రేకమయ్య, బుచ్చన్న పాల్గొన్నారు.

1104 యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక

పాలమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ జిల్లా కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు స్వామి, పాండు తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, సాయిబాబా, వరప్రసాద్, భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 1104 యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. కమిటీని ప్రకటించారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత

నవాబ్‌పేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యన్మనగండ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శశికాంత్, వెన్నెల కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ సిరంజీలు, అసురక్షితమైన లైంగిక సంబంధాలు, రక్త మార్పిడి ద్వారా ఈ వ్యాధి సోకుతుందన్నారు. ప్రిన్సిపాల్ శ్యామిలి శా, డైరెక్టర్ రవిశంకర్, నరిసంహ, చెన్నయ్య, వెంకటేష్, జాన్సి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన మండల స్థాయి క్రీడలు

హన్వాడ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రెండు రోజుల పాటు నిర్వహించే మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను ఎంపీడీవో యశోదమ్మ, తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంఈవో గోపాల్ ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు అధికారులు బహుమతులు అందించారు. బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ యాదవ్, కాంగ్రెస్, బీజేపీ మండల అధ్యక్షులు మహేందర్, కొండ లింగన్న, మాజీ ఎంపీపీ బాలరాజు, పీడీలు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, బీసీ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్, హెచ్ఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న నాయకులు

క్రీడలతో మానసికోల్లాసం

మూసాపేట, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసాన్ని కలుగుజేస్తాయని ఎంఈవో రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మూసాపేట పాఠశాల మైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ పోటీలో అండర్-14 కబడ్డీ బాలుర విజేతలు జడ్పీహెచ్ఎస్ మూసాపేట ప్రథమ స్థానం, జడ్పీహెచ్ఎస్ నిజాలాపూర్ ద్వితీయ స్థానం, కబడ్డీ బాలికల జడ్పీహెచ్ఎస్ పోల్కంపల్లి ప్రథమ, జడ్పీహెచ్ఎస్ మూసాపేట ద్వితీయ, కబడ్డీ-17 బాలుర మూసాపేట ప్రథమ, నిజాలాపూర్ ద్వితీయ, బాలికల్లో కేజీబీవీ ప్రథమ, మూసాపేట ద్వితీయ, ఖోఖో-14లో బాలుర జానంపేట ప్రథమ, మూసాపేట ద్వితీయ, బాలికల జానంపేట ప్రథమ, కేజీబీవీ ద్వితీయ, ఖోఖో-17 బాలుర మూసాపేట ప్రథమ, జానంపేట ద్వితీయ, బాలికల జానంపేట ప్రథమ, మూసాపేట ద్వితీయ, వాలీబాల్-14లో మూసాపేట ప్రథమ, జానంపేట ద్వితీయ, వాలీబాల్-17లో మూసాపేట ప్రథమ, విశ్వభారతి పాఠశాల ద్వితీయ స్థానంలో గెలుపొందగా, వారికి బహుమతులు అందజేశారు. నాయకులు కొండయ్య, తిరుపతయ్యగౌడ్ ఉన్నారు.



విజేతలకు బహుమతి అందజేస్తున్న నాయకులు

ఘనంగా శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కోయిలకొండలో అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు

కోయిలకొండ, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట డీసీసీ మాజీ అధ్యక్షుడు కే.శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆది ఆంజనేయస్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకుడు పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. గార్లపాడ్ టీపీసీసీ లీగల్ కన్వీనర్ తూర్పు రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో పూజలు నిర్వహించి, పండ్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు రవినాయక్, రాజునాయక్, రామునాయక్, సత్యపాల్‌రెడ్డి, జగన్‌గౌడ్, యాదవ్‌కుమార్, విక్రమ్ తేజగౌడ్, రామస్వామి, నాగరాజు, ఎండీ.గౌస్, సూరిగౌడ్, రాజుగౌడ్, సతీష్‌కుమార్, దీలీప్‌కుమార్, బాలుగౌడ్, చంద్రమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యూ రిషి స్కూల్‌లో ఘనంగా హిందీ దివస్



హిందీ దివస్ కార్యక్రమంలో భాగంగా సరస్వతీ వేషధారణలో విద్యార్థిని

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని న్యూ రిషి పాఠశాలలో హిందీ దివస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాషాభిమానాన్ని చాటేలా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు హిందీ భాషా ప్రాముఖ్యతను వివరించారు. కవులు, వారు రాసిన కవితల గురించి వివరించారు. అదే విధంగా పద్య రచన, క్విజ్, చర్చ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ పూజితా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించేలా శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, ఇన్‌చార్జి మాలతి పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి ఉపాధ్యాయులే మూలం

గండీడ్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధికి ఉపాధ్యాయులే మూలమని డీఈవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రవనికి డీఈవో పాల్గొని, మాట్లాడారు. ఎంఈవో జనార్దన్, జీహెచ్ఎంలు తిరుపతమ్మ, విజయలక్ష్మి, రవిబాబు, టీజీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి హీరాలాల్, సీపీఎస్ఈయూ జిల్లా ప్రధాన రకార్యదర్శి చంద్రకాంత్, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, పీఆర్టీయూ తెలంగాణ మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్ రెఫరల్స్‌పై దృష్టి పెట్టాలి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జనరల్ ఆసుపత్రి నుంచి హైదరాబాద్ ఆసుపత్రులకు చేస్తున్న రెఫరల్స్‌పై దృష్టి పెట్టాలని జిల్లా 108 అంబులెన్సుల కోఆర్డినేటర్ రవి మంగళవారం సూపరింటెండెంట్‌ను కలిసి విన్నవించారు. చాలా వరకు కేసుల్లో అత్యవసరం కానివే ఉంటున్నాయని, వ్యాధి తీవ్రత, రోగి అత్యవసరాన్ని బట్టి హైదరాబాద్ ఆసుపత్రులకు రెఫరల్స్ చేసేలా డాక్టర్లకు సూచనలు చేయాలని కోరారు. అదే విధంగా పార్థీవ వాహనాల ద్వారా పార్థీవ దేహాలను కుటుంబీకుల ఇళ్లకు చేరుస్తున్నామన్నారు. క్యాజువాలిటీలోని డాక్టర్లకు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

మునిసిపల్ భవన నిర్మాణ పనుల పరిశీలన

జడ్చర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణ పనులను మంగళవారం మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ పాలాది సారిక, కమిషనర్ లక్ష్మారెడ్డి, ఈఈ విజయ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. భవనాన్ని త్వరగా అందుబాటులోకి తెచ్చే విధంగా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌తో పాటు సంబంధిత శాఖ అధికారులకు చైర్‌పర్సన్ కోరారు. అనంతరం 15, 17, 20వ వార్డుల్లో డ్రైనేజీ నిర్మాణాలు, పారిశుధ్య పనులు పరిశీలించారు. కౌన్సిలర్లు ప్రశాంత్‌రెడ్డి, కుమ్మరి రాజు, సతీష్, రఘురాంగౌడ్, రమేశ్, ఉమాశంకర్‌గౌడ్, లత, ఉమారాణి, చైతన్య పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

పాలమూరు, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : దివిటిపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రజలు రాకపోకలు సాగించడానికి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రైల్వేశాఖ అధికారులను కలిసి సమస్యలు వివరించారు. బ్రిడ్జి కింద నుంచి ప్రజలు రాకపోకలు సాగిస్తుండటంతో వర్షాకాలంలో అనేక ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో రాకపోకలు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. లేకపోతే కనీసం కంపౌండ్ వాల్ దగ్గర ప్రత్యేక గేటును ప్రారంభించాలన్నారు. అధికారులను కలిసిన వారిలో పట్టణ కార్యదర్శి చంద్రకాంత్, రాజ్, వరద గాలెన్న, రాములు, అంజనేయులు, రాజు పాల్గొన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిద్దాం

జడ్చర్ల, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విమోచన దినోత్సవం సెప్టెంబరు 17న ఖచ్చితంగా అందరూ నిర్వహించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి నందనం దివాకర్ కోరారు. జడ్చర్ల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులలో మాట్లాడారు. 1947లో స్వాతంత్ర్యం వచ్చినా, తెలంగాణ ప్రాంతం నిజాం 7వ అసఫ్ జా అయిన మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన సంస్థానాన్ని దేశంలో విలీనం చేయలేదన్నారు. నిజాం పరిపాలనలో రజాకార్ల వ్యవస్థతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. రజాకార్ల అరాచకాలను అరికట్టడానికి, భారత ఆపరేషన్ పోలో సైనిక చర్యను భారత సైన్యం చేపట్టడంతో 1948 సెప్టెంబరు 17న నిజాం రాజు లొంగిపోయి తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేశారని వివరించారు. దీంతో తెలంగాణకు నాటి నుంచి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. బీజేపీ నాయకులు అమర్‌నాథ్‌గౌడ్, బాలకృష్ణ, బాలవర్ధన్‌గౌడ్, రాజేష్, సామల నర్సిములు, సాహితిరెడ్డి, వెంకట్, బుక్క నవీన్, పల్లె తిరుపతి, నాగసాల శ్రీనివాస్ రెడ్డి, జగదీశ్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మందులు అందజేస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి

మిడ్జిల్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామ ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, అందుకోసం వైద్య శిబిరాలు అవసరమని బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతిఅల్వాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తూరులో చేయూత రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కారడి మార్త డేవిడ్, ఎస్వీఎస్ ఆసుపత్రి, ఎన్నం సత్యనారాయణగుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులు అరుణ్‌కుమార్, సాయికిరణ్, అనన్య, వసుధ, సాయిప్రసన్న, శిరీష, దీపిక, హితాక్షి, దివ్య350 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పద్మసత్యనారాయణగుప్తా, వెంకట్‌రెడ్డి, రాములు, కృష్ణయ్య, వెంకటయ్య, అభిలాష్‌రెడ్డి, మల్లేష్, మహేష్, బాల్‌రెడ్డి, బాల్‌రాజ్, విష్ణు, సత్యనారాయణ, నరేష్, రమేష్, కృష్ణారెడ్డి, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని అంబేడ్కర్ నగర్‌లో గల రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద రూ.10 లక్షలతో మల్టీ పర్పస్ షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కాలనీలో రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళా సంఘాల సభ్యులకు భవనాలను నిర్మిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకులు వినోద్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, నాయకులు సుధాకర్‌రెడ్డి, శాంతన్నయాదవ్, రాంలక్ష్మణ్, కమిషనర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ టౌన్ : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు మంగళవారం ఎమ్మెల్యే యెన్నంకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ గౌరవాధ్యక్షు డు ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలవడానికి హైదరాబాద్‌కు తరలివెళ్లారు.







